# 112. వందనాల వరదారావు

**మా** పాత ఆఫీసులో వి.వరదారావు అని ఒక అతను సీనియర్ గుమస్తాగా పనిచేసేడు. 'వి. వరదారావు' అనే దాంట్లో "వి. అంటే (అతని ఇంటిపేరు) ఏమిటో గాని, అతన్ని అందరూ వందనాల వరదారావు అనేవారు. ఎందుకంటే, థాంక్యు, థాంక్స్, థాంక్స్ సార్ అని ఎవరి గ్రేడుకి తగ్గట్టుగా వారికి వందనాలు చెప్పడం అతనికి అలవాటుగా ఉండేది. మాట వరసకి -

ఆఫీసులో పని చేస్తున్నప్పుడు "వెంకటస్వామీ, మంచి నీళ్ల పట్రా" అంటాం. వెంకటస్వామి మంచినీళ్లు తెచ్చి అందించినప్పుడు గాని ఆ నీళ్లు తాగేసేక ఎంగిలి గ్లాసు అందించేసేటప్పుడు గాని థాంక్స్ చెప్పక పోడం సంగతి అలా వుంచి, అతని మొహమైనా చూడకుండా పని జరుపుకుంటాం.

మనం చేతిరాతతో రాసిన నోటో, డ్రాఫ్టో ఆఫీసరుగారు తొందరగా చదువుకోలేరేమో అన్న సందేహం వస్తే టైపిస్టు దగ్గిర కూచుని అతనికి సుత్తివేసి టైపు చేయిస్తాం. అయిపోయాక హడావిడిగా ఆ (టైపు చేసిన) కాగితాన్ని పట్టుకొచ్చేస్తాం.

గుండుసూదో, రబ్బరు బేండో, జెమ్క్లిప్పో మనసీట్లోది సమయానికి కనబడకపోతే పక్కసీట్లో వార్ని అడిగి పని జరుపుకుంటాం.

వేరే సెక్షన్ నించి ఏదైనా సమాచారం కావలసొచ్చినప్పుడు ఫోన్లో పిల్చి కనుక్కొని ఫోను పెట్టేస్తాం.

ఇలాంటి ఏ సందర్భంలోనూ కూడా థేంక్స్ చెప్పకపోడం చాలా మందికి రివాజు. వందనాల వరదారావు అలా ఎప్పుడూ చేసేవాడు కాదు.

వరదారావుకి "థాంక్స్" ఒక్కటేకాక; "సారీ", "ఎక్స్క్యూజ్ మీ", "ఇఫ్ యూ డోంట్ మైండ్"; "ప్లీజ్" లాంటి మాటలు కూడా అలవాటుగా వచ్చేసేవి. అతని "మేనర్స్" మంచివి అని ఆఫీసర్లే అనేవారు. అంచేత అతన్ని కొందరు "మేనర్స్ వరదారావు" అని కూడా అనేవారు.

ఒకసారి వరదారావు ఆఫీసుకి కొంచెం ఆలస్యంగా వచ్చి; "ఎక్స్క్యూజ్‌మి" అని సంభాషణ ప్రారంభించేడు. "ఇవాళ సెలవు పెట్టాలి. ఇఫ్ యూ డోంట్ మైండ్, ఒక కాగితం ఇయ్యి; ప్లీజ్" అన్నాడు. సరేకదా అని ఇచ్చేను. "థేంక్యూ. నీ పెన్ కూడా ఒకసారి ఇలా ఇయ్యి. నా షెల్ఫ్ ఓపెన్ చేసేటంత టైమ్ కూడాలేదు. సారీ." అన్నాడు. లీవులెటరు రాసేసి, ఆ కాగితాన్ని సూపరింటు గారికి ఇచ్చే హడావిడిలో పెన్ కిందపడి పోయింది. దాన్ని తీసి నాకు అందిస్తూ "సారీ" అన్నాడు. ఈ వ్యవహారం అంతా గమనిస్తున్న బాబూరావు అతన్ని ఆపి, "సారీట, సారీ! నీ అడావిడిలో గురువుగారి పెన్‌కాస్తా పుణ్యాం కట్టుకున్నావు. నువ్వైతే సెలవు పెట్టేసి పోతున్నావు గాని ఆయన ఇవాళంతా పెన్ లేకుండా ఎలా పని చేస్తారనుకున్నావు? షెల్ఫ్ తెరిచి ఆ బాల్‌పాయింట్ పెన్‌లో కొత్త రీఫిల్ తగిలించి మరీవెళ్లు" అని తగిలించాడు బాబూరావు.

వరదారావు "మేనర్స్" పాటించడంలో ఒక్కొక్కప్పుడు పప్పులో కాలేస్తూ ఉండడం కూడా కద్దు. ఓసారి అతని ఫ్రెండొకాయన వచ్చి అతనితో పావుగంట సేపు మాట్లాడి "వెళ్లొస్తానోయ్" అన్నప్పుడు "థాంక్స్" అన్నాడు. ఈ బాబూరావే అది గమనించి, "అతను వెళ్లిపోయినందుకు థాంక్సా? అంటే, అతనింత సేపూ బోరు కొట్టేడనే కదా అర్థం?" అని బుకాయించేడు.

మొన్న ఆగస్టు పదిహేను నాడు వరదారావు వాళ్ల కాలనీలో ఏదో ఫంక్షను వుందని చెప్పి అందరికీ ఇన్విటేషన్లు పంచేడు. విశేషం ఏమిటా అని చూస్తే వాళ్ల కాలనీలో ఉంటున్న ఒక ఔత్సాహిక కవి రాసిన దేశ భక్తిగేయాల సంకలనం ఆవేళ ఎమ్మెల్యేగారు ఆ సభలో ఆవిష్కరిస్తారని ఉంది : "ఇందులో నీ ఇంట్రెస్టు ఏమిటి?" అని ఎవరో అడిగితే కార్డు వెనక్కి తిప్పి చూపించేడు. అక్కడ "ఎజెండా" అనబడే ఓ "కార్యక్రమ క్రమం" ముద్రించి వుంది. అందులో చివర్ని వందన సమర్పణ: వి. వరదారావు అని వుంది.

ఓహో ఇదా సంగతి, అని ఆ సభకి వెళ్లేను. వందనాల వరదారావు మామూలు సమయాలప్పుడే థేంక్స్ బాగా చెప్తాడు కదా; సభా ముఖంగా ఆ బాధ్యతని ఎంత రసవత్తరంగా నిర్వహిస్తాడో చూద్దామని చివరిదాకా ఉన్నాను. అతని "వందన సమర్పణ స్పీచి" ఇలా సాగింది:-

"వేదికమీద ఆసీనులైన పెద్దలకు, సభను అలంకరించిన ప్రేక్షక సోదరసోదరీ మణులకు నమస్కారం. ఈ సభలో వందన సమర్పణ చేయమని నన్ను నియమించినందుకు నిర్వాహకులకు వందనాలు.

"అయితే, వందన సమర్పణ చేయడానికి నాకేమీ మిగల్లేదు.

సభాధ్యక్షులు తమ ఉపన్యాసంలో కవికీ, అంకితం పుచ్చుకున్న ఎమ్మెల్యే గారికీ వందనాలర్పించేరు.

ఎమ్మెల్యేగారు ఈ గేయాలను రేడియోలోనూ టీవీలోనూ గానం చేసిన పరమేశం గారికి వందనాలర్పించేరు.

కవిగారు ఈ గేయాన్ని ఇంతకి ముందు అచ్చువేసిన పత్రికల సంపాదకులనుంచి ఇప్పుడు అచ్చువేసిన ప్రెస్సు వారి వరకూ అందరికీ వందనాలర్పించేరు.

అలాగ ఎంతమంది ఉపన్యాసాలిచ్చేరో అంతమందీ కూడానూ ఇక్కడున్న వాళ్లందరికీని కొందరు ఇక్కడలేని వాళ్లకీని వందనాలర్పించేరు.

అంచేత ఈ సభే ఒక వందన సమర్పణ కార్యక్రమంగా సాగింది.

అయినా, పెద్దలందరూ వదిలేసిన కొందరు ఉండిపోయినందుకు; అదే, కొందర్ని నాకు మిగిల్చినందుకు సభలో ఉపన్యాసాలిచ్చిన వారందరికీ వందనాలు. ఈ మిగిలిపోయిన వాళ్లు ఎవరంటేనూ, ఈ సభకు ఈ హాలును ఉచితంగా ఇచ్చిన రాఘవయ్యగారు; మధ్యలో కరెంటు ఆపకుండా ఉన్న విద్యుత్ శాఖవారు; ముందు వరుసల్లో కూర్చున్నందువల్ల మధ్యలో లేచి వెళ్లిపోవడానికి వీల్లేక చివరిదాకా ఉండిపోయిన వారు, అద్దెకే అయినా మైకులు సప్లయి చేసిన హీరాలాల్ కంపెనీ వారు - వీరందరికీ నా వందనాలు!"

ఇందులో ఏం చురకలున్నాయో గాని; వేదిక మీదవున్న పెద్దలందరూ మొహాలు గంభీరంగా పెట్టుకుని దిగారు, కిందికి.

★